ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 11 ఫిబ్రవరి 2025

హ్యామ్ పద్ధతిలో పంచాయతీ రోడ్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- పైలెట్ ప్రాజెక్ట్‌గా కల్వకుర్తి నియోజకవర్గం



స్ప్రింక్లర్ల సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్ , ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని రహదారులను విస్తరించి వేగవంతంగా అభివృద్ధి చేసి రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హ్యామ్ తొలి పైలెట్ ప్రాజెక్ట్ కింద కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. హైబ్రీడ్ యానిటీ మోడల్ కింద దేశంలోనే తొలిసారిగా పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని రోడ్ల అభివృద్ధికి కల్వకుర్తి నుంచి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ ప్రత్యేక చొరవతో హ్యామ్ కింద కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 296 కిలోమీటర్ల పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని రోడ్లను ఆధునీకరించి అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. రోడ్ల పనులకు సంబంధించి ఇప్పటికే సర్వే ప్రారంభమైందని వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన, గ్రామీణ రహదారులను రూ. 500ల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

ఆరుతడి పంటలు లాభదాయకం

ఆరుతడి పంటలు సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 51 మంది రైతులకు సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే అందజేశారు.



కుదింపు!

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పంచాయతీ, ప్రాదేశిక నియోజకవర్గాల పరిధి తగ్గిపోయింది. దీంతో మండలాలు తగ్గడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల సంఖ్య సైతం తగ్గింది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎంపీటీసీలు, పంచాయతీల సంఖ్య తగ్గగా.. వికారాబాద్‌లో మాత్రం పెరిగింది. ఈ నేపథ్యంలో కొందరు నాయకుల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులు నిరాశ చెందుతున్నారు. పంచాయతీల సంఖ్య తగ్గడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకున్న నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో తగ్గిన ఎంపీటీసీ, గ్రామ పంచాయతీల సంఖ్య
- వికారాబాద్ జిల్లాలో మాత్రం పెరిగింది
- మున్సిపాలిటీల్లో విలీనమైన పలు గ్రామాలు
- ఆశావహులకు తగ్గనున్న అవకాశాలు

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ప్రతి మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వల్ల కొన్నిచోట్ల ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో ఎంపీటీసీ స్థానాల స్వరూపం మారింది ఎంపీటీసీ స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో వీటి స్థానాలు తగ్గాయి. అలాగే పంచాయతీల పరిస్థితి కూడా

మిగతా 7వ పేజీలో...



అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. మొత్తం 67 ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బర్డ్‌ఫ్లూ రాకుండా ఫౌల్ట్రీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. పక్క రాష్ట్రంలో పౌల్ట్రీఫామ్స్‌లో బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకుతున్న నేపథ్యంలో వెటర్నరీ అధికారులు పౌల్ట్రీఫాంలను సందర్శించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అన్నారు. వెటర్నరీ డాక్టర్లు ఫౌల్ట్రీ ఫాంకు వచ్చినప్పుడు సహకరించాలని, కోళ్లు పెద్ద మొత్తంలో చనిపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కోళ్లు వ్యాధి సోకి చనిపోతే వాటిని పాతిపెట్టి బయో కెమికల్ పౌడర్ చల్లాలని, ఇంకా వేరే కోళ్ల ఫారాలకు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మంలో బర్డ్‌ఫ్లూ సోకినందునా జిల్లాలోని ఫౌల్ట్రీ యజమానులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పట్టా ఇచ్చారు.. పొజిషన్ మరిచారు

- న్యాయం చేయాలని కలెక్టర్‌కు కందుకూరు వాసుల వినతి
- పట్టా సర్టిఫికెట్లతో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కందుకూరు వాసులు


రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పట్టా ఇచ్చారు... కానీ పొజిషన్ చూపించలేదని కందుకూరు వాసులు కలెక్టర్ నారాయణరెడ్డి ఎదుట వాపోయారు. గ్రామంలోని సర్వే నెంబరు 788, 107లో 530 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిపారు. లే అవుట్ లేకుండా.. ప్లాట్ నెంబర్ వేయకుండా పట్టా సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిపారు. అక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటే ఆర్డీవో పోలీసుల సహాయంతో జేసీబీతో తొలంగించారని చెప్పారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి స్థలం చూపించి గృహాలను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

కొబ్బరిబోండాలు తాగుతున్న యువకులు



భానుడి భగభగలు

- పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- ఊపందుకున్న పండ్ల, పానీయాల విక్రయాలు
- రూ.50 ధర పలుకుతున్న కొబ్బరిబోండాలు



ఆమనగల్లు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎండాకాలం రానేరాలేదు భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఫిబ్రవరిలోనే వేసవిని తలపించే వాతావరణం కనిపిస్తోంది. రోజురోజుకూ పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఆమనగల్లులో గత మూడు రోజుల నుంచి 25, 27, 29 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే చాలు ఎండ వేడిమికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. బయటకు అడుగుపెట్టాలంటేనే జనం జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదు. పొద్దస్తమానం ఎండ ఉండి. రాత్రి అయ్యేసరికి చలి పెడుతోంది. ఇదిలా ఉంటే వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ప్రజలు చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరిబోండాలు, పండ్లరసాలు, ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్ల విక్రయాలు జోరందుకున్నాయి. అలాగే ఎండ తీవ్రతకు నీరసించిపోకుండా పండ్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు ముదరడంతో వ్యాపారులకు కూడా కలిసి వచ్చింది. కూల్‌డ్రింక్స్‌లో క్రిమిసంహారక అవశేషాలున్నాయనే ప్రచారంతో చాలామంది కొబ్బరిబోండాలు, పండ్ల రసాలను తాగడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే స్థానికంగా కొబ్బరిబోండాలు తగినంత దిగుమతి లేకపోవడంతో బెంగుళూరు, కోనసీమ నుంచి విక్రయదారులు తీసుకువస్తున్నారు. దీంతో కాయ నాణ్యతను బట్టి రూ.50 నుంచి రూ.60 వరకు కొబ్బరి బోండాలను విక్రయిస్తున్నారు. అలాగే పండ్ల ధరలు పెరగడంతో వాటి రసాల రేట్లను కూడా పెంచేశారు. పండ్ల రసాల రకాలను బట్టి రూ.20 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో ద్రాక్షపండ్ల విక్రయాలు అధికంగా జరుగుతాయి. వీటి కిలో ధర రూ.120 నుంచి రూ.150వరకు పలుకుతుంది. అలాగే పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన మట్టికుండల కొనుగోళ్లు కూడా మొదలయ్యాయి. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, కాటన్ దుస్తులు, క్యాప్‌ల విక్రయాలు పెరిగాయి. మొదలయ్యాయి. ఆమనగల్లులో సీజనల్ వ్యాపారాలతో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా వీటి విక్రయాలే కనిపిస్తున్నాయి.

చేవెళ్లలో కేటీఆర్‌కు ఘనస్వాగతం

పట్టణంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

చేవెళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చేవెళ్లలో ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ వెళ్తూ మార్గమధ్యలో చేవెళ్లలో ఆగారు. ఈ సందర్భంగా పట్టణంలోని షాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. పార్టీ నాయకులంతా తనతోపాటు కొడంగల్‌కు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే కేటీఆర్ రాక సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలో భారీగా బీఆర్ఎస్ పార్టీ జెండాలను దారిపొడవునా కట్టారు. ఆయన వెంట మాజీ మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్, రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ ఎంపీటీసీలు ఎల్లయ్య, రవీందర్, మాజీ సర్పంచ్‌లు మోహన్ రెడ్డి, నాయకులు ఎం. యాదగిరి, నరేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, మహేందర్, కృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : కేటీఆర్‌ను ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కేటీఆర్‌ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.



చేవెళ్లలో మాట్లాడుతున్న కేటీఆర్

కొనసాగుతున్న సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ
- గరుడ ప్రసాదం పంపిణీ చేసిన చిన జీయర్‌స్వామి



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్ ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముచ్చింతల్‌లో సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు రెండవ రోజు వైభవంగా కొనసాగాయి. చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో జరుతున్న ఈ ఉత్సవాల్లో సోమవారం ధ్వజారోహణ, గరుడ ప్రసాదం పంపిణీ, అష్టాక్షరి మంత్ర జపం, తీర్థగోష్టి, సేవాకాలం, అగ్ని ప్రతిష్ఠ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన జీయర్ స్వామి యాగ కార్యక్రమాన్ని ప్రారంభించారు స్వామీజీ స్వయంగా భక్తులందరికీ తీర్థ, ప్రసాదాలను అందించారు. తర్వాత నిత్యపూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలు జరిపించారు. అగ్ని ప్రతిష్ఠ పూర్తయ్యాక సమతామూర్తి ఎదురుగా ఉన్న గరుడ ధ్వజం దగ్గర రుత్విక్‌లతో కలిసి గరుడ పటాన్ని ఆవిష్కరించారు. శ్రీమన్నారాయణుని వాహనమైన గరుత్మంతుని ఆకారం ఒక వస్త్రంపై చిత్రించి ధ్వజస్తంభంపై ఎగురవేశారు. అనంతరం పిల్లలు లేని దంపతులకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, జగపతిరావు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు సీజన్ వ్యాధుల నివారణకు పశువులకు టీకాలు సకాలంలో వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని అన్నోజిగూడ గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య, గర్భకోశవ్యాధి చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడి పశువులకు గాలికుంటు వ్యాధి అధికంగా సోకుతుందని దీని నివారణకు సకాలంలో వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. అలాగే పశుగ్రాసం రకాల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో 86 పాడి పశువులకు చికిత్స చేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ రేవతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాకి దశరథముదిరాజ్, రాచులూరు, పశు వైద్యాధికారి డాక్టర్ షాహిన్‌షేక్, సిబ్బంది జంగయ్య, మాధవి, నరేష్, అఫ్సర్, ఆరీఫ్, రమేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీచెన్నకేశవుని కల్యాణం

కడ్తాల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్న కేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకకు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ విగ్రహాల నగలకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఐదు తులాల బంగారం, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ తులం బంగారం, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి రూ.2లక్షలు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ రూ.2లక్షలు, ఆనంద్ రూ.60వేలు ఆలయ అభివృద్ధికి విరాళం ప్రకటించారు. అలాగే మాజీ ఉప సర్పంచ్ జంగారెడ్డి ఆలయానికి గోదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ్మా, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఈవో మోహన్ రావు, దశరథ్‌నాయక్, విజితారెడ్డి, ఆంజనేయులు, ఆనంద్, రాఘవేందర్ పాల్గొన్నారు.



లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తిమ్మాపురం కళాకారుడికి నంది అవార్డు



ప్రభాకర్‌కు నంది అవార్డును అందిస్తున్న సినీప్రముఖులు రాజబాబు

కందుకూరు,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ప్రజా జానపద గాయకుడు మంద ప్రభాకర్ తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బంగారు నంది అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సామెల్, సినీ ప్రముకులు రాజబాబుల చేతుల మీదుగా ప్రభాకర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న తాను జానపద గీతాలపై మక్కువ ఉండడం వలన వాటిని తనదైన శైలిలో పాడడం వల్ల ఈ అరుదైన అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ తెలుగు కళారత్నాలు సంస్కృతికసేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ రత్నం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు ధనరాజ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు బ్రేక్

- చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో నిలిపివేత
- కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న అధికారులు



చేవెళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నూతన మున్సిపాలిటీలోని విలీన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేవెళ్ల, మొయినాబాద్‌ను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా మున్సిపాలిటీలకు కొత్తగా కమిషనర్లను సైతం నియమించింది. ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న విలీన గ్రామ పంచాయతీల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్ల క్రయ విక్రయాలను ఈనెల 7వ తేదీ నుంచి పూర్తిగా బంద్ చేసింది. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని చేవెళ్ల, ఊరెళ్ల, కేసారం, దామరిగిద్ధ, రామన్నగూడ, ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవల్లి, మల్కాపూర్ గ్రామాల్లో, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మొయినాబాద్, పెద్దమంగళారం, చిల్కూరు, ముర్తజాగూడ, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, సురంగల్, ఎన్కేపల్లి తదితర గ్రామాల్లో ప్లాట్ల రిజిస్టేషన్లు జరపొద్దని రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

వ్యవసాయ భూములకు ఓకే..

మున్సిపాలిటీల్లో విలీనమైన పంచాయతీల్లో ప్లాట్లకు సంబంధించి కొత్తగా మ్యాపింగ్, సీసీఏ కాపీలతోపాటు మ్యూటేషన్లలో గ్రామ పంచాయతీలకు బదులుగా మున్సిపాలిటీ పేరు నమోదు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు పూర్తిస్థాయిలో అప్‌డేట్ అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మాత్రమే నిలిపివేసింది. వ్యవసాయ భూములకు సంబంధించిన ధరణి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమైన చేవెళ్ల సబ్ రిజిస్టార్ దాసరి వెంకటరమణను వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో కొత్తగా ఏర్పడిన చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామ పంచాయతీల రిజిస్టేషన్లు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీల పేరుతో కొత్తగా స్వఫ్ట్‌వేర్ ఆఫ్‌డేట్ చేస్తుందన్నారు. మున్సిపాలిటీలు ఏర్పాడిన నాటి నుంచి ఆ గ్రామాలలో జరిగే రిజిస్టేషన్ల టీడీ అమౌంట్ గ్రామ పంచాయతీలకు కాకుండా మున్సిపాలిటీలకు వచ్చేలా ఉన్నతాధికారులు మార్పులు చేస్తున్నారని చెప్పారు. బుధవారం వరకు ఆఫ్‌డేట్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు కొత్తగా చేసిన మార్పుల అనంతరం తిరిగి రిజిస్ట్రేషన్లను యాదావిధిగా కొనసాగిస్తామని సబ్‌రిజిస్టర్ స్పష్టం చేశారు.

నెలనెలా బిల్లులు ఎందుకివ్వడం లేదు



కుర్మిద్దలో మదర్‌డెయిరీ మేనేజర్ వెంకటయ్యను ప్రశ్నిస్తున్న రైతులు

యాచారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల నెలా బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదు. తాము అప్పులు చేసి పాడి పశువులను పెంచుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని యాచారం మండలంలోని కుర్మిద్దకు చెందిన పాడి రైతులు మాల్ మదర్‌డెయిరీ మేనేజర్ వెంకటయ్య సోమవారం కుర్మిద్ద పాల సేకరణ కేంద్రానికి వచ్చి ప్రశ్నించారు. గతంలో మాదిరిగా రైతులకు ప్రోత్సాహకాలు కూడా అందించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులను ఆదుకోకపోతే ఎలా అని నిలదీశారు. అధికారులే కావాలని బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పాల ధరలను ఎందుకు తగ్గించారని మేనేజర్‌ను అడిగారు. పాల ధరలను పెంచడంపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రతి పది రోజులకో మారు బిల్లులు ఇవ్వాలని కోరగా తాను ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తానని మేనేజర్ చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జంగయ్య తదితరులు ఉన్నారు.

'మన బడి' బిల్లులివ్వకుంటే ఆత్మహత్యే శరణ్యం



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బాధితులు

బిల్లులు ఇవ్వాలంటూ ప్రజావాణిలో వినతి

వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించే పనులు చేపట్టి రెండేళ్లవుతున్నా ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని, అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఎస్ఎంసీ కమిటీల బాధ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు లక్నాపూర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతించాలని కోరారు. అప్పట్లో ఉన్నతాధికారుల మాటలు విని ఇంట్లో ఉన్న బంగారం కుదువపెట్టి పనులు చేపట్టామని, ఆ పనులు పూర్తయి రెండేళ్లవుతున్నా బిల్లులు రాలేవని వాపోయారు. తాము చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పాఠశాలలకు తాళాలు వేస్తామని, పాఠశాలల్లోకి విద్యార్థులను అనుమతించమని, ఎన్నికల పనులకు కూడా ఆ పాఠశాలలను ఉపయోగించకుండా అడ్డుకుంటామన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పనులు చేపట్టిన వారికి బిల్లులు చెల్లించి మిగతా నియోజవర్గాల వారికి చెల్లించకపోవడం ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అప్పులు ఇచ్చిన వారు రోజూ తమ ఇళ్ల వద్దకు తిరుగుతున్నారని, అప్పటి కలెక్టర్, డీఈవో పనులు చేయాలని చెప్పినందుకే తాము చేశామన్నారు.

కోర్టు ఆవరణలో మహిళ ఆత్మహత్యాయత్నం

- ఆస్తి తగాదాలు, కుటుంబ గొడవలే కారణం
- ఇబ్రహీంపట్నం కోర్టు వద్ద ఘటన



కూతుళ్లతో కమలాబాయి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలు, కుటుంబంలో గొడవల కారణంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో సోమవారం ఓ మహిళ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అక్కడ ఉన్నవారు అడ్డుకున్నారు. పోలీసులు ఆమెను స్టేషన్‌కు తెసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. వివరాల్లోకి వెళితే.. యాచారం మండలం మంథన్‌గౌరెల్లి గ్రామ పంచాయతీ కేస్లీ తండాకు చెందిన జర్పుల భద్రియ, కమలాబాయి దంపతులకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి కోసం నగరంలో కూలీ పని చేసుకుంటున్నారు. భద్రియ మంథన్‌గౌరెల్లికి చెందిన మరో మహిళ పద్మతో పరిచయం ఏర్పడి రెండో వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కాగా మొదటి భార్య కమలాబాయితో విడాకులు తీసుకోకుండానే రెండో వివాహం చేసుకోవడంతో ఇరువురి మధ్య ఆస్తి తగాదా నడుస్తోంది. కమలాబాయి మొదటి కూతురుకు వివాహమైంది. రెండో కూతురు వివాహం గురించి భద్రియ పట్టించుకోకపోవడంతో అతని పేరున ఉన్న రెండెకరాల్లో తనకూ వాటా కావాలని కమలాబాయి 2021లో కోర్టులో కేసు వేసింది. కోర్టు కేసు ఉండగానే భద్రియ 20 గుంటల భూమిని ఇతరులకు విక్రయించాడు. తాను నియమించుకున్న అడ్వకేట్ కూడా ప్రలోభాలకు గురై కేసు నుంచి తప్పుకుంటున్నాడంటూ ఆమె ఆందోళన వెలిబుచ్చింది. ఇదే క్రమంలో తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె బలవన్మరణానికి పాల్పడడం అక్కడున్న వారిని కలిచివేసింది. కాగా ఇది సివిల్ తగాదా కావడంతో కోర్టులోనే తేల్చుకోవాలని పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయితే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కమలాబాయిపై ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్ సూచనల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాస్మెటిక్ సైన్స్‌లో విద్యార్థినులకు శిక్షణ

డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ముందుకు వస్తే కాస్మెటిక్ సైన్స్‌లో విద్యార్థినీలకు శిక్షణను ఇవ్వడానికి ఫ్రాన్స్‌లోని యూరోపియన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీతో కొలాబరేషన్ కల్గిఉన్న అబిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్మెటిక్ సైన్స్ సంస్థ అంగీకరించిందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు. సింగపూర్‌లోని నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైన షాద్‌నగర్ నివాసి సామ రవీందర్‌రెడ్డి సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. చదువుతున్న విద్యార్థినీలు స్వయం ఉపాధిని పొందేవిధంగా అబిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్మెటిక్ సైన్స్ సంస్థ పలు కోర్సులపై శిక్షణను ఇస్తున్నదని తెలిపారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినీలతో పాటు ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థినీలకు శిక్షణ ఇవ్వాలని సంస్థ డైరెక్టర్ సకినా పంజాబ్‌ను కోరగా అందుకు ఆయన అంగీకరించారని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థినీల అంగీకారం తీసుకుని శిక్షణ కోసం నివేదికను పంపిస్తే ఎంఓయు కుదుర్చుకుని ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభిస్తారని డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

తిరుపతిరెడ్డికి సన్మానం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు. సోమవారం తాండూరు పర్యటనకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్వాగతం పలికారు. తిరుపతిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పలకరిస్తు స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ మెజార్టీ సాధించాలని సూచించారు. ఆయన వెంట మాజీ జడ్పిటిసి దారాసింగ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, తదితరులు ఉన్నారు.

ఆర్టీఏ మెంబర్‌కు..



వికారాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజమతుల్లాహ్ హుస్సేని సోమవారం వికారాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్‌ను మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. జాఫర్‌ను చైర్మన్ సన్మానించగా, జాఫర్ చైర్మన్‌ను సన్మానించారు. అనంతరం వారు వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

వైభవం.. మల్లన్న కల్యాణం

- ఆకట్టుకున్న ఒగ్గు కళాకారుల ప్రదర్శన
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం బొంకూరు, బిజ్వారం గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర మూడు రోజులు వైభవంగా కొనసాగింది. ధ్వజస్తంభ పూజ, వెండి పల్లకీసేవా, గంగాస్నానం, స్వస్థి పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, మహా రుద్రాభిషేకం, గొలుసు తెంచుట, అగ్నిగుండం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం గ్రామం నుంచి బోనాల ఊరేగింపు తీశారు. అనంతరం భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి కల్యాణాన్ని కోటేశ్వరాశివాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ, కుర్వ కిష్టయ్య కల్యాణాన్ని, కుర్వ బసంత్, శ్రీలత, బాల్‌రాజ్,మమత, చిలకమ్మ, బాలమ్మ కుటుంబీకులు పాల్గొని ఘనంగా కల్యాణాన్ని నిర్వహించారు. రాస్నంకు చెందిన అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్యన కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంతరం ఒగ్గు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఎర్టీ అధ్యక్షుడు జెర్నె నాగప్ప, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, కాంగ్రెస్ నాయకులు వడ్డె శ్రీనివాస్, కోతి గోపాల్, కరన్‌కోట్ జగదీశ్వర్, ఉదయ భాస్కర్‌రెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్వ సంఘం ప్రతినిధులు పూజారి పాండు, నర్సింహులుతోపాటు మరికొంత మంది సభ్యులకు ఎముకల ఆయుర్వేద నాటు వైద్యులు, ఆలయ ధర్మకర్త కుర్వ కిష్టయ్య సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కుదింపు!

(5వ పేజీ తరువాయి)

ఇదే తరహాలోనే ఉంది. గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో చేరడంతో వీటి సంఖ్య భారీగానే తగ్గింది. జిల్లాలో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో 25 స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. ఔటర్ చుట్టూ ఉన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 232కు చేరింది. ఆయా మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందుతుండటంతో ఎంపీటీసీ సంఖ్య తగ్గుతూ వస్తుంది. జిల్లాలో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 27 మండలాలు ఉండగా.. వీటిలో హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్, గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి మండలాలను పూర్తిగా అర్బన్ మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ అర్బన్ మండలాలన్నీ జీహెచ్ఎంసీ పరిధిలో భాగంగానే ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 గ్రామీణ మండలాలున్నాయి. వీటిలో 21 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రంగారెడ్డి జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నుంచి 9 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో పంచాయతీల సంఖ్య 549కి చేరుకుంది. కొత్తగా మున్సిపాలిటీల ఏర్పాటుతో మరో 18 పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో గ్రామ పంచాయతీల సంఖ్య 531కి చేరుకుంది. ఈ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు జరిగే 531 గ్రామ పంచాయతీల్లో 4,710 వార్డులు ఉన్నాయి. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటుతో ఏటేటా గ్రామ పంచాయతీల సంఖ్య తగ్గుతూ పోతున్నాయి. కానీ.. మున్సిపాలిటీల సంఖ్య పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో ఇంతకు ముందు 13 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. కొత్తగా ఈసారి చేవెళ్ల, మొయినాబాద్ మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. దీంతో మున్సిపాలిటీల సంఖ్య 15కు చేరుకుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ సంఖ్య ప్రస్తుతం 18కి చేరుకుంది.

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 41 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 28 స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాల సంఖ్య 19కి చేరుకుంది. జిల్లాలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా 28 పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ప్రస్తుతం ఆ సంఖ్య 34 గ్రామ పంచాయతీలకు చేరుకుంది. తొమ్మిది మున్సిపాలిటీలు, నాలుగు కార్పొరేషన్లుగా ఉన్నాయి. జిల్లాలో ఇంతకు ముందు ఘట్‌కేసర్, కీసర, మేడ్చల్, మూడు చింతలపల్లి, శామీర్‌పేట మండలాలు జడ్పీటీసీలుగా ఉండేవి. ఘట్‌కేసర్, కీసర మండలాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో రెండు జెడ్పీటీసీ స్థానాలు తగ్గాయి. ప్రస్తుతం వీటి సంఖ్య (మేడ్చల్, మూడు చింతలపల్లి, శామీర్‌పేట్) మూడుకు చేరుకుంది.

వికారాబాద్‌లో పెరిగిన స్థానాలు

వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఆరు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఇంతకు ముందు 18 మండలాల పరిధిలో 221 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, జిల్లాలో రెండేళ్ల కిందట పెరిగిన చౌడాపూర్, దుద్యాల మండలాలతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 227కు పెరిగింది. ఇంతకు ముందున్న ఎంపీటీసీ స్థానాలతో పోలిస్తే కులకచర్ల మండలంలో 4, పరిగి మండలంలో 2, దౌల్తాబాద్ మండలంలో ఒకటి, బొంరాస్‌పేట్ మండలంలో 4 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇంతకు ముందు కులకచర్ల మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్ మండలంతో ఇప్పుడు 12 స్థానాలకు తగ్గాయి. పరిగి మండలంలో ఇది వరకు 13 ఎంపీటీసీలు ఉండగా, మారిన సమీకరణాలతో 11 స్థానాలకు తగ్గాయి. దౌల్తాబాద్ మండలంలో ఇంత వరకు 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఇప్పుడు 14 స్థానాలకు తగ్గాయి. బొంరాస్‌పేట్ మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన దుద్యాల మండలంతో ఇప్పుడు 11 స్థానాలకు పరిమితం కానుంది. కాగా, కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్ మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు, దుద్యాల మండలంలో 8 ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే, జిల్లాలో కొత్తగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 12, నారాయణపేట జిల్లా నుంచి 2 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. జిల్లాలో ఇంతకు ముందు 585 గ్రామ పంచాయతీలు ఉండగా, కొత్తగా విలీనమైన పంచాయతీలతో 599 పంచాయతీలకు పెరిగాయి. ఇదిలా ఉంటే, పరిగి మునిసిపాలిటీలో కొత్తగా పరిగి మండల పరిధిలోని నస్కల్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, మల్కాపూర్, నజీరాబాద్ గ్రామ పంచాయతీలను విలీనమయ్యాయి. దీంతో జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 594, వార్డుల సంఖ్య 5058కు చేరుకుంది.

హత్య చేసిన వ్యక్తికి పదేళ్లు జైలు

షాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ని హత్య చేసిన ఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద స్నేహితుల మధ్య ఘర్షణలో రమేష్, నర్సింహులు ఇద్దరు కలిసి మరొక వ్యక్తిని హత్యచేశారు. అప్పట్లో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత రమేష్ మృతిచెందాడు. నేరం రుజువుకావడంతో నర్సింహులుకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ సోమవారం ఎల్బీనగర్ అదనపు కోర్టులో న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో అప్పటి ఇన్‌స్పెక్టర్ అశోక్‌తోపాటు ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, రఘు, సత్యనారాయణ సిబ్బంది వెంకటేశ్, అనీఫ్, ప్రభాకర్, జంగయ్య కృషితో నిరూపితం అయిందన్నారు.

నైపుణ్యాలు వెలికితీయడానికే హ్యాకథాన్



మాట్లాడుతున్న డీన్ విజయ్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలు వెలికితీయడానికి హ్యాకథాన్లు దోహదపడుతాయని అనురాగ్ యూనివర్సిటీ డీన్ విజయ్‌కుమార్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం హ్యాకాట్రానిక్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాకథాన్లతో విద్యార్థుల్లోని సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. రెండురోజుల్లో 36 గంటలపాటు హ్యాకట్రానిక్స్ హ్యాకథాన్ జరుగుతుందని తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 350 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్, సాయి సంతోషీ, మంగళగౌరీ, నారాయణ, పవిత్ర, అమృత పాల్గొన్నారు.

ఓంకారేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో కొత్తగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వీరశైవలింగాయత్, లింగ బలిజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివుడు, నంది ఇతర విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా శివనామస్మరణతో కులకచర్ల మార్మోగింది. వేలాది మంది భక్తులు పాల్గొల్లో పాల్గొన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్నే ఈశ్వరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు ధర్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణయ్యగౌడ్, ఆనంద్, మాజీ సర్పంచ్‌లు జానకీరామ్, సౌమ్యరెడ్డి, వీరశైవలింగాయత్, లింగ బలిజ సంఘం సభ్యులు మంతయ్య, కాశీనాథ్, వీరేశం, ఈశ్వరయ్య, సతీశ్‌కుమార్, రవిచందర్ పాల్గొన్నారు.

భారత సంస్కృతిని కాపాడుకోవాలి



క్విజ్ పోటీల్లో విద్యార్థులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రామదూత ఆశ్రమ పీఠాధిపతి శివానంద స్వామి అన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే దేశభక్తి భావాలు పెంపొందించుకొని రామాయణం, మహాభారతం పురాణాల గురించి తెలుసుకోవాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని సరస్వతీశిశుమందిర్‌లో సోమవారం శ్రీ రామదూత ఆశ్రమం, శ్రీ అభయాంజనేయ భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వేద పురానేతిహాస ప్రహేళిక క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి పీఠాధిపతి శివానంద స్వామి, శిశుమందిర్ పాఠశాల అధ్యక్షుడు పాపిశెట్టి రాములు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో దొంతు విశ్వనాథం, దొంతు సత్యనారాయణ, నారాయణ గౌడ్, దామోదర్, బుచ్చిరాములు, బావండ్ల అంజయ్య, యాదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, కవిత, భద్రయ్య, నయనాచారి, చంద్రశేఖర్, వాసు, అంజయ్య, లింగయ్య, శ్రీకాంత్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

నందిగామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'మా భూములు మాకు ఇప్పించండి సారూ' అంటూ 1975లో భూదాన్ భూమి పట్టాపొందిన రైతులు సోమవారం రంగారెడ్డి కలక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. 1975లో ఆంధ్రప్రదేశ్ భూదాన్ బోర్డు 6346/1975 నంబర్ ఉత్తర్వుల ద్వారా నందిగామ మండల కేంద్రానికి చెందిన 18 మంది పేదలకు అప్పటి గ్రామసభ తీర్మానం మేరకు సర్వే నంబర్లు 638, 639, 845, 846, 848, 849, 850, 852లలో 99 ఎకరాల 22 గుంటల భూమికి ప్రొసీడింగ్ ఇచ్చారు. భూదాన్ బోర్డు అందించిన భూములకు 1977లో ఐఏ/4749/1977 నకిలీ ఓఆర్‌సీ సృష్టించి కొందరు కబ్జా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి మేము అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడంలేదని, సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎనిమిది రోజులుగా నందిగామ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు సాయిబాబ, చెన్నగళ్ల అశోక్, రైతులు శ్రీను, వెంకటయ్య, బొంగుపల్లి జంగయ్య, పోచయ్య, యాదమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాములు నాయక్‌ను కలిసిన నాయకులు



రాములు నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రమేశ్ నాయక్, శ్రీను నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్‌ను సోమవారం ఆమనగల్లు మండలానికి చెందిన బంజార దివ్యాంగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాములును కలిసి దివ్యాంగులకు పెన్షన్, స్వయం ఉపాధి పథకాలు, ప్రభుత్వ పథకాల్లో పెద్దపీట వేయాలని వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని రాములు నాయక్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



మొయినాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మొయినాబాద్ మండలాధ్యక్షుడిగా కేతిరెడ్డిపల్లికి చెందిన దారెడ్డి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం కేటీఆర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కొడంగల్ వెళుతున్న కేటీఆర్ హిమాయత్‌గర్‌లో నియామకపత్రాన్ని అందజేశారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించిన అధినాయకత్వానికి, జిల్లా, మండల నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం

వీహెచ్‌పీ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్



షాద్‌నగర్/షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేయడాన్ని విశ్వ హిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ ప్రకటనలో ఖండించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం పాటు పడుతున్న రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలయ పూజారిగా, ఆధ్యాత్మిక బోధకుడిగా సేవలందిస్తున్న రంగరాజన్‌పై శ్రీరామ చంద్రుని సేన పేరుతో దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం సమగ్ర విచారణను చేపట్టి దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని రమేష్ కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి



ప్యాడ్లు అందిస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మున్సిపల్‌లోని కేజీబీవీ విద్యార్థులకు సోమవారం ఆమె పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కేజీబీవీ స్పెషలాఫీసర్ మధురవేణి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేడు కేశంపేటకు ఎమ్మెల్యే శంకర్ రాక

కేశంపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నేడు(మంగళవారం) నిర్వహించే ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన విజయోత్సవ ర్యాలీలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొంటారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కేశంపేట మండల కేంద్రంలో ర్యాలీ ఉటుందని, కార్యకర్తలు, అభిమానులు, ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్, ఎస్సీ, బీసీసెల్ నాయకులు భారీగా హాజరుకావాలని కోరారు.

15న సంత్ సేవలాల్ జయంత్యుత్సవాలు

కడ్తాల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్‌పతి నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యానాయక్ లు అన్నారు. మండల కేంద్రంలో గిరిజన సేవాలాల్ సేన సంఘం భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల నిర్వాహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. లక్‌పతి నాయక్, నరేశ్ నాయక్‌ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మండలంలోని అన్ని పార్టీల, సంఘాల గిరిజన నేతలు హాజరయ్యారు. సమావేశానికి ముందు సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 15న సేవాలాల్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. కడ్తాల మండల కేంద్రంలో భారీ ర్యాలీ, బోగ్‌బండార్, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు పత్యానాయక్, హీరాసింగ్, బీక్యానాయక్, జవహర్‌లాల్ నాయక్, తదితరులున్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

యాచారం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) ద్విచక్రవాహనాదారులు విధిగా హెల్మెట్ ధరించాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు అన్నారు. సోమవారం సాయంత్రం మేడిపల్లిలో ద్విచక్ర వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మీర్‌ఖాన్‌పేటలో గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. మద్యానికి బానిసకారాదన్నారు. చీటికిమాటికి ఘర్షణలకు దిగి విలువైన ధనం సమయం వృథా చేసుకోరాదని సూచించారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన కొత్తూరు పార్వతమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.17,500 మంజూరు అయ్యాయి. కాగా, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కును సోమవారం వెల్జాల గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు అజీజ్, యాదయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, రవికుమార్, భాస్కర్, నిరంజన్, చంద్రయ్య, కృష్ణయ్య, ఆరిఫ్, తదితరులు ఉన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

● పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తజనం ● ప్రత్యేక పూజలు, అభిషేకాలు



చౌదరిగూడ : మల్లికార్జున స్వామి కల్యాణంలో భక్తులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో ఉదయం రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, గణపతిపూజ, స్వామివారి కల్యాణం, కుంకుమార్చణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివస్వాములకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అందె భద్రప్ప, బాలింగం, చంద్రశేఖర్, సంఘమేశ్వర్, అమ్రేష్, అందె మహేష్ శివస్వాములు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి : మండల పరిధిలోని వెల్జాల శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. వెల్జాలతో పాటు సమీప గ్రామాల భక్తులు, ప్రజలు ఉత్సవాలలో పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా చక్రతీర్థం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు, భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు యాదగిరి నృసింహాశర్మ, శ్రీనివాస మూర్తి, మాజీఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ సంగీత, మాజీ ఎంపీటీసీ అంబాజీ, వెంకట్ రెడ్డి, ఆరిఫ్, విష్ణువర్ధన్, కూన రవి, తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలతో శాంతి

కడ్తాల్ : దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. మల్లాపూర్‌లో వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన శివస్వాముల పూజల్లో పాల్గొని పూజలు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీజడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం

మాడ్గుల : మండలంలోని ఇర్విన్ గ్రామ పరిధిలోని దిలవార్‌ఖాన్‌పల్లిలో నీలాభూనీలా సమేత చెన్నకేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిచారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూదిని శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ జి.వెంకటయ్య, గౌరవాధ్యక్షుడు అయ్యపురెడ్డి, ఇట్టే శ్రీనివాస్‌రెడ్డి, కుదారం వంశస్తులు పాల్గొన్నారు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కేశంపేట : మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గుట్టపై వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి (మంగళవారం)నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారం రోజులుగా బ్రహ్మోత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యుడు పల్లె ఆనంద్ కుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి కృపకు పాత్రులవ్వాలని కోరారు.



తలకొండపల్లి : ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో భారతీయ కిసాన్ సంఘం నాయకులు ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహా యకార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, జిల్లా కోశాధికారి పెంటారెడ్డిలు మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు విద్యుత్ పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రం అందించామని, సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. ధరణి సమస్యలను సైతం ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం చేవెళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, వీరేశం, శివుడు, ఎర్ర శ్రీకాంత్, విశ్వనాథం, దేవయ్య, మల్లేష్, నర్సింహారెడ్డి, బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వినతి

కడ్తాల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మక్తమాదారంలో విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ కడ్తాల మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్‌లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేకు వారు వినతి పత్రం అందజేశారు. మక్తమాదారంలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కుకు ప్రతిపాదనలు పంపామని, వీలైనంత త్వరగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

యాచారంలో 50,975 మంది ఓటర్లు

యాచారం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 24 పంచాయతీల్లో 14 ఎంపీటీసీ స్థానాలకు గాను ఫైనల్ ఓటర్‌లిస్టును సోమవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత ప్రదర్శించారు. మండలంలో 50,975 మంది ఓటర్లున్నారని అధికారులు తెలిపారు. 14 ఎంపీటీసీ స్థానాలకు 94 పోలింగ్ కేంద్రాలను నిర్ణయించారు. త్వరలో జరిగే ఎంపీటీసీ ఎన్నికలకు మండల పరిషత్, రెవెన్యూ అధికారులు సన్నదమవుతున్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించి పోలింగ్‌కు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు.

చౌదరిగూడ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాగంగా అధికారులు ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు గ్రామాల వారీగా ఓటర్ల జాబితా, పంచాయతీ ఎంపీటీసీ స్థానాల వివరాలను వెల్లడించారు. కొందుర్గు మండలంలో 8ఎంపీటీసీ స్థానాలు, 23,760 మంది ఓటర్లు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 9 ఎంపీటీసీ, 25,671 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో లాలయ్య, కాంగ్రెస్ నాయకులు మల్లేష్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి

కడ్తాల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్‌లు కోరారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన చుక్కని నరేశ్‌కు మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో ముఖ్య మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మండల కేంద్రంలో సోమవారం బాధిత కుటుంబానికి వారు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు నర్సింహ్మ, రామచంద్రయ్య, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు పొందిన వారికి ఇళ్లు కట్టివ్వాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నాగన్‌పల్లి రెవెన్యూ రామోజీ ఫిలిం సిటీ వద్ద గతంలో పట్టాలు పొందిన పేదలకు ఇళ్ల స్థలాలు చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓ.యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణిలో ఆర్డీవో అనంతరెడ్డికి సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి వినతిపత్రమందజేశారు. ఆయన మాట్లాడుతూ నాగన్‌పల్లి రెవెన్యూ సర్వేనెంబర్లు 189, 203లలో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూరుకు చెందిన 677 మందికి వైఎస్ఆర్ హయాంలో ఇళ్ల పట్టాలిచ్చారని గుర్తుచేశారు. వారికి పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ములుగు నర్సింహ, నాయకులు శివరాల లక్ష్మయ్య, అలీమొద్దీన్ తదితరులున్నారు.

అట్టహాసంగా ముగిసిన వాలీబాల్ పోటీలు



షీల్డ్‌లు అందిస్తున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఆమనగల్లు వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పది జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. టోర్నమెంట్‌లో స్ట్రైకర్స్ జట్టు విన్నర్, స్టార్స్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు మనోహర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై షీల్డ్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. ఆమనగల్లు అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్, జిల్లా నాయకుడు ఎనుముల రమేశ్, నిర్వాహకులు లండం జగన్, పవన్ కళ్యాణ్, మహేందర్, ఆర్గనైజర్లు గోరటి దేవేందర్, కోరే రవి, సురేశ్, చాంద్‌పాష, గౌస్, భరత్, మల్లేశ్, వెంకటేశ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షకు తరలిన ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే



కేటీఆర్‌కు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ తదితరులు

కొత్తూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో నిర్వహించితలపెట్టిన రైతు దీక్షకు బీఆర్ఎస్ శ్రేణులు కొత్తూర్ మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ నివాసానికి తరలివెళ్లి మద్దతు ప్రకటించి, ఆయనవెంట కొడంగల్‌కు తరలివెళ్లారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని నవీన్‌కుమార్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌లు ఈ సందర్భంగా ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇస్నాతి మచ్చేందర్, బ్యాగరి సత్తయ్య, అశోక్, చిర్ర మధుసూదన్‌రావు, పాత్లావత్ లక్ష్మణ్, గుండు సురేష్ తదితరులు కొడంగల్‌కు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

కొందుర్గు ఎస్సైగా రవీందర్ నాయక్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రవీందర్ నాయక్.. బదిలీపై వెళ్తున్న ఎస్సై కృష్ణయ్యకు వీడ్కోలు పలుకుతున్న షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య

చౌదరిగూడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల ఎస్సైగా రవీందర్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కొందుర్గు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై కృష్ణయ్య షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సైగా బదిలీ అయ్యారు. షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య సమక్షంలో కొందుర్గు ఎస్సైగా రవీందర్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే సిబ్బందితో సమావేశమై ఏర్పాటుచేసి మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై కృష్ణయ్యకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికి, బాధ్యతలు స్వీకరించిన రవీందర్ నాయక్‌కు స్వాగతం పలికారు. జిల్లేడ్ చౌదరి గూడ ఎస్ఐ విజయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆమనగల్లు : పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని ఆమనగల్లు ఎస్సై బి. వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ పనిచేస్తూ ఎస్సైగా పదోన్నతి పొంది శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన యాదయ్యకు సోమవారం పోలీసు స్టేషన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. రెండో ఎస్సై సీతారాంరెడ్డి, ఏఎస్సై బాల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ఆమనగల్లు : ఎస్సై యాదయ్యను సన్మానిస్తున్న ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది

సంక్షిప్తంగా..

షాద్‌నగర్ అర్బన్ : దేశానికి పట్టుడు అన్నం పెడుతున్న రైతులను ఆదుకునే కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆదివారం నిర్వహించిన ధర్నాకు సీఐటీ యు అనుబంధ సంఘాల కార్యకర్తలు తరలివెళ్లారు. ఉ పాధిహామీ పనులకు నిధులు పెంచాలని కోరారు. శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, యాదయ్య, తదితరులున్నారు.

శంషాబాద్ రూరల్ : మై హోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ గ్రూపునకు చెందిన శ్రీ జయజ్యోతి సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎస్‌జేసీపీఎల్ 30వ మైన్స్ ఎన్విరాన్‌మెంట్ అండ్ మినరల్ కన్జర్వేషన్ వీక్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మైన్స్ ఎన్విరాన్‌మెంట్ అండ్ మినరల్ కన్జర్వేషన్ కౌన్సిల్ సహకారంతో ప్రోగ్రాంను శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. పలు స్టాల్స్‌ను ప్రదర్శించారు. అనంతరం వివిధ కేటగిరీల్లో బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

శంషాబాద్ రూరల్ : ఇంప్లాంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బాలికై జరిగిన లైంగికదాడికి యత్నం కేసుకు సంబంధించి నూతన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫాదర్ ఆంథోనిని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ సోమవారం కలిసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంకెప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. డ్రైవర్‌పై కఠిన శిక్ష విధించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

యాచారం : మేడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 1992-93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు పాఠశాల హెచ్ఎం ఉదయశ్రీకి రూ.లక్ష నగదును అందించారు. నిధులతో పాఠశాలలో వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని వారు ప్రధానోపాధ్యాయురాలిని కోరారు, పూర్వ విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలమణి, జ్యోతిరెడ్డి, జంగయ్య, భూపాల్‌రెడ్డి, బాలయ్య, బన్నె శ్రీ శైలం, రవీందర్‌గుప్త తదితరులున్నారు.

కడ్తాల్ : ఎక్వాయిపల్లిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం స్థానిక నాయకులు భూమిపూజ చేశారు. ఎక్వాయిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు,ఎస్సీ సబ్ ప్లాన్ కింద సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పాలకుర్ల కరుణాకర్ గౌడ్, సుమన్ , యాదయ్యగౌడ్, మల్లేశ్ గౌడ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నిత్య పూజలు గావిస్తున్న అర్చకులకు డీసీసీ అధికార ప్రతినిధి, జిల్లా మాజీ ఎంపీటీసీల సంఘం గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి చేయూతనందించారు. ఆలయంలో పనిచేసే అర్చకుల గౌరవ వేతనాల కోసం శ్రీనివాస్ రెడ్డి ప్రతియేటా రూ.60 వేలు వ్యక్తిగతంగా అందిస్తూ వస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఈ ఏడాదికి సంబంధించిన రూ.60వేలు అందజేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్‌యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన మహిళ హత్య



సత్యమ్మ (ఫైల్)

షాద్‌నగర్/షాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన మహిళ హత్యకు గురైన సంఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఫరూఖ్‌నగర్ మండలం రంగంపల్లి వద్ద చోటుచేసుకుంది. షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. షాబాద్ మండలం మన్‌మర్రికి చెందిన జట్టని సత్యమ్మ(60) ఈనెల 7న ఉదయం కంటి సమస్య ఉందని షాద్‌నగర్ ఆసుపత్రికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సత్యమ్మ ఆచూకీ లభించలేదు. దాంతో 8వ తేదిన షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఫరూఖ్‌నగర్ మండలం రంగంపల్లి వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లిచూడగా సత్యమ్మగా గుర్తించారు. మృతిరాలిని బండరాళ్లతో తలపై మోది హత్యచేసి, ఆమె ఒంటిపై ఉన్న నగలను దొంగిలించి వెళ్లినట్లు గుర్తించారు. భర్త అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, అప్పారెడ్డిగూడ వద్ద ఒక కారులో ఎక్కి షాద్‌నగర్ వచ్చినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు షాద్‌నగర్ సీఐ విజయకుమార్ తెలిపారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



చంద్రయ్య (ఫైల్)

షాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి కథనం మేరకు.. షాబాద్ మండ ల కేంద్రానికి చెందిన గడ్డం చంద్రయ్య (48) కుటుంబ సభ్యులతో గొడవపడి తాను చెరువులో పడి చనిపోతానని భార్య యాదమ్మకు శనివారం మధ్యాహ్నం చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చంద్రయ్య కోసం చెరువు పరిసర ప్రాంతాల వద్ద వెతికినా ఫలితం లేదు. దాంతో షాబాద్ పోలీస్‌స్టేషన్ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సోమవారం షాబాద్ పహిల్వాన్ చెరువులో నీటిపై వ్యక్తి శవం తేలుతూ ఉన్నట్లు సమాచారం అందడంతో వెళ్లిచూడగా మృతుడు గడ్డం చంద్రయ్యగా గుర్తించారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో చోరీ.. బంగారు ఆభరణాలు అపహరణ

షాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరబడి బంగారు నగలతో పాటు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని సంకేపల్లిగూడకి చెందిన కుమ్మరి చంద్రకళ ఇల్లు గ్రామ సమీపంలోని మసీదు వద్ద ఉంటుంది. ఈనెల 9న ఉదయం తన కోడలు, పిల్లల ఆరోగ్యం బాగా లేకపోవడంతో షాద్‌నగర్‌లో ఆసుపత్రికి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా బెడ్‌రూంలోని బీరువాలో పుస్తెలతాడు, నానుచైన్, కమ్మలు, పట్టగొలుసులు, టీవీ, కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

కొత్తూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జేపీ దర్గా సమీపంలో గల పీర్ల చెరువులో సోమవారం చేపల వేటకు వెళ్లి రాజునాయక్(35) అనే వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై మురళీగౌడ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కాలోనీతండాకు చెందిన రాజునాయక్ చేపల వేటకు పీర్ల చెరువులోకి దిగాడని తెలిపారు. చేపల కోసం వేసిన వలలో చిక్కుకొని అతడు బయటకు రాలేదన్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారని, రాజునాయక్ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయిందన్నారు. చీకటి పడడంతో మంగళవారం గాలింపు చేపడుతామని ఎస్సై తెలిపారు.

కారు-క్రూయిజర్ ఢీ.. పలువురికి తీవ్ర గాయాలు

యాచారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కారు, క్రూయిజర్ ఎదురెదురుగా ఢీకొనడంతో పన్నెండు మంది తీవ్రంగా గాయపడ్డారు, సోమవారం సాయంత్రం యాచారం మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును ఎదురుగా వస్తున్న క్రూయిజర్ గున్‌గల్ రిజర్వాయర్ వద్ద బలంగా ఢీకొంది. దాంతో కారు కొంత ఎత్తువరకు ఎగిరి రోడ్డు పక్కన పడింది. కారు నాలుగు డోర్లూ బిగుసుకుపోయాయి. దారిన పోయేవారు, పోలీసులు అతికష్టం మీద డోర్లు బలవంతంగా తీసి అందులో క్షతగాత్రులను బయటకు తీశారు. మేడిపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయన తండ్రి రాంచంద్రారెడ్డి, తల్లి స్వప్న, బంధువులు జయమ్మ, భారతమ్మ, కవిత, సుగుణమ్మ, చింతపట్లకు చెందిన ఇందిరమ్మలు గాయపడ్డారు. వారిని పోలీసులు అంబులెన్స్‌లో భృంగి ఆసుపత్రికి తరలించారు. కాగా, క్రూయిజర్‌లో ఉన్న యాదయ్య, బుచ్చయ్య, సుచరిత, శ్రీనివాస్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారమందుకున్న సీ ఐ నర్సింహారావు, ఎస్సై మధులు ఘటనా ప్రదేశానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు

విద్యార్థికి, ఆయాకు స్వల్ప గాయాలు

ఆదిబట్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రైవేట్ స్కూల్ బస్సు డివైడర్‌ను ఢీకొనగా ఓ విద్యార్థికి, ఆయాకు స్వల్ప గాయాలైన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు కథనం మేరకు.. బొంగ్లూర్ సమీపంలోని నలంద ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు చింతపల్లిగూడ నుంచి 4,5, వ తరగతికి చెందిన విద్యార్థులను ఎక్కించుకొని మంగల్‌పల్లి నుంచి బొంగ్లూర్ వైపు వస్తుంది. ఈక్రమంలో బొంగ్లూర్ సమీపంలోని కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఉన్న రైస్‌మిల్లు నుంచి వరిపొట్టు లోడుతో లారీ బొంగ్లూర్ వైపు వెళ్తుంది. ఓవర్ స్పీడ్‌గా ఉన్న ప్రైవేటు స్కూల్ బస్సు లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో డివైడర్‌పైన ఉన్న సెంట్రల్ లైటింగ్ పోల్ విరిగిపోయింది. స్కూల్ బస్సులో ఉన్న పదిమంది విద్యార్థుల్లో నాలుగో తరగతి చదువుతున్న సాత్విక్(9) మోచేతికి, స్కూల్ ఆయా మంగమ్మ(38) తలకు స్వల్ప గాయాలు కావడంతో పదిహేను కుట్లు పడ్డాయి. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

స్కూటీని బొలెరో ఢీకొనడంతో మహిళకు..

కొత్తూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో జేపీ దర్గా చౌరస్తా వద్ద స్కూటీని బొలెరో(గూడ్స్ వాహనం) ఢీకొనడంతో మెగావత్ సుగుణ అనే మహిళ గాయపడింది. జేపీ దర్గా నుంచి జాతీయ రహదారి వైపు వస్తున్న బొలెరో వాహనం షాద్‌నగర్ వైపు స్కూటీపై వెళ్తున్న సుగుణను ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. అటుగా వెళ్తున్న స్థానిక ఎస్సై శ్రీనివాస్ సుగుణను ఆసుపత్రికి తరలించారు. ఎస్సై శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు. సుగుణ సోదరుడు దాసు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం మహిళలు కదం తొక్కారు. గట్టిప్పలపల్లి గ్రామంలో సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జేఏసీ నాయకులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడికి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం ప్రకటించే వరకు పోరాటం సాగిస్తామని జేఏసీ నాయకులు ఉద్ఘాటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 102వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ సంఘాల నేతలు కూర్చున్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని, స్థానిక ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు చొరవ తీసుకోవాలన్నారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.